క్లుప్తంగా

వైద్య సిబ్బంది స్థానికంగా ఉండాలి

సామర్లకోట: గ్రామాల్లో ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్లలో సిబ్బంది స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవా లని పీబీ దేవం సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంత్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రెండు హెల్త్ సెంటర్లు ఉండగా ఒక సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్) మెటర్నిటీ లీవ్‌లో ఉండగా ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదన్నారు. అలాగే మరో ఎంఎల్‌హెచ్‌పీ స్థానికంగా ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ సెంటర్లలో సిబ్బంది 24 గంటలూ సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడలు

సామర్లకోట: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా గురు, శుక్రవారాల్లో మండల స్థాయి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య తెలిపారు. ఈ మేరకు మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగే పోటీలకు హాజరు కావాలన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగ, టెన్నికాయిట్, షటిల్ బ్యాట్మింటన్, త్రోబాల్, పరుగు పందెం, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. గురువారం బాలురకు, 15వ తేదీన బాలికలకు పోటీలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు కోఆర్డినేటర్లుగా శ్రీదేవి, తాళ్లూరి వైకుంఠం, వెంకటేష్ వ్యవహరిస్తారని తెలిపారు.

రేపు విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఈఈ ఏవీ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల ఫోరం చైర్మన్ (విశ్రాంత న్యాయమూర్తి) సత్యనారాయ ణ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో వినియోగదారులు విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

శృంగార వల్లభుని ఆలయ అభివృద్ధికి సహకరించండి



ఆలయ అభివృద్ధిపై వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్, ఈఓ, ఎంపీటీసీ

పెద్దాపురం: తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి మరిన్ని నిధులు కేటాయించి మరింత అభివృద్ధికి సహకరించాలని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు ఆలయ చైర్మన్ కర్రి వెంకట రామజగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజులు కోరారు. విజయవాడ దేవదాయ శాఖ కార్యాలయంలో మంగళవారం వారు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అభివృద్ధికి అవసరమైన డిమాండ్లను కమిషనర్ ముందుంచినట్లు వారు తెలిపారు. వినతిపత్రంలో ఉన్న ఆలయ అభివృద్ధి అంశాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఈఓ నారాయణమూర్తి తెలిపారు.

మహిళా ఉద్యోగుల భద్రతపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గీత

కాకినాడ: మహిళా ఉద్యోగుల భద్రతపై మరింత అప్రమత్తత, జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. ముంబాయిలో మంగళవారం జరిగిన మహిళా సాధికార కమిటీ సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఆయిల్ ఇండియా, ఓఎన్జీసీ, కేంద్ర ప్రభుత్వ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, కార్పొరేట్ అఫైర్స్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూబీఐ ఉన్నత స్థాయి అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా ఉద్యోగినుల భద్రత, రక్షణ, హక్కులపై చర్చించి అనేక సూచనలు ఇచ్చారు. ఆయా సంస్థల ద్వారా విడుదలయ్యే సీఎస్సార్ నిధులు, వాటి ప్రాధాన్యం, వినియోగంపై ఆమె ఆ చర్చల్లో పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మల్లిశాల, వెంగాయ్యమ్మపురం గ్రామల మధ్య పంట పొలాల్లో పేకాట శిబిరంపై దాడి చేసినట్టు జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.13500 స్వాధీనం చేసుకున్నామన్నారు.

అధికం అనర్థమే..

- పెరుగుతున్న ఎరువులు, పురుగు మందుల వినియోగం
- సారం కోల్పోతున్న భూమి
- నాణ్యత లేని ఉత్పత్తులు
- పిఠాపురం నియోజకవర్గంలో 12,078 హెక్టార్లలో సాగు



పొలంలో ఎరువులు జల్లుతున్న రైతు

కొత్తపల్లి: బస్తాలకు బస్తాలు ఎరువులు, డబ్బాలకు డబ్బాలు రసాయనిక పురుగు మందులు వాడడం వల్ల పంటలో తెగులు నశించకపోగా కొత్త తెగుళ్లు పుట్టుకొస్తాయి. ఏటా అధిక శక్తి కలిగిన మందులను రైతులు పంటపై పిచికారీ చేస్తూ పోతున్నారు. దీంతో పెట్టుబడులు పెరగడంతోపాటు వ్యవసాయ ఉత్పత్తులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలో ఈ ఏడాది 12,078 హెక్టార్లలో రైతులు వరిసాగు చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలో 6167 మంది రైతులు 10264 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులు విచక్షణా రహితంగా వినియోగిస్తున్నారు. దీంతో ఏటా పెట్టుబడి వ్యయం రెట్టింపవుతోందని అధికారులు చెబుతున్నారు.

ఎక్కువ రసాయన మందులు వాడడంతో..

రైతులు అవసరానికి మించి 15 నుంచి 25 శాతం అధికంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడుతున్నారు. వరి సాగు ఖర్చుల కంటే రసాయనిక ఎరువుల ఖర్చే అధికంగా ఉంటోంది. సాధారణంగా ఎరువుల ఖర్చే అధికంగా ఉంటోంది. ఎకరాకు 2 బస్తాల డీఏపీ, రెడున్నర బస్తాల యూరియా, బస్తా పొటాష్ సరిపోతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కానీ, రైతులు అంతకు మించి ఎరువులు వాడుతున్నారు. దీని వల్ల సారం క్షీణించి, జీవం లేని భూమిగా తయారవుతోంది. రైతులకు వ్యయం పెరగడంతోపాటు పురుగు మందులను తట్టుకునే సామర్థ్యం కీటకాలకు పెరుగుతోంది. ఫలితంగా ఎన్ని మందులు వాడినా కీటకాలు, తెగుళ్లు నశించడంలేదు.



ఎరువులను కలుపుతున్న రైతు

వర్మీ కంపోస్టుతో మేలు

రసాయన ఎరువుల వాడకం తగ్గించడంతోపాటు భూసారం పెంచేలా వ్యవసాయశాఖ రైతులను ప్రోత్సహిస్తోంది. రాయితీపై వర్మీ కంపోస్టు యూనిట్లు అందిస్తోంది. వర్మీ కంపోస్టు ఎరువుల వల్ల పంటలకు ప్రయోజనంతోపాటు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను సాధించవచ్చునని అధికారులు ప్రచారం చేస్తున్నారు. అయితే రైతులు ఆసక్తి చూపడంలేదు. స్వల్ప సంఖ్యలో మాత్రమే వీటిని అందుకుంటున్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న వారిలో 75 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. నిబంధనల మేరకు వీరు ఆయా పథకాలను అందుకునేందుకు సాంకేతిక అవకాశం లేదు.

వినియోగం అధికం



వరికి ఎరువులు అధికంగానే వినియోగిస్తాం. ఎకరం వరికి దమ్ములో డీఏపీ బస్తా, యూరియా అర బస్తా ఇవికాక రెండు బస్తాల కాంప్లెక్స్ ఎరువులతో పాటు 2 బస్తాల యూరియాను వాడతాం. ఒక బస్తా పోటాష్ వినియోగిస్తాం. వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల వినియోగం తగ్గించాలని అవగాహన కల్పిస్తున్నారు.
– దొడ్డి సూరిబాబు, కొండెవరం, రైతు

భూసారం కోల్పోయి..



భూసారానికి అనుగుణంగానే ఎరువులను వినియోగించాలి. విచక్షణా రహితంగా ఎరువులు వినియోగించడం వల్ల రైతులకు పెట్టుబడి పెరగడంతోపాటు క్రమేపీ భూసారం కోల్పోయి పంటలకు పనికి రాకుండాపోతుంది. మట్టి నమూనాల సేకరణలో ఏటా చౌడుభూముల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఎరువులు మోతాదుకు మించి వినియోగించడం వలన ప్రయోజనం ఉండదు. సేంద్రీయ ఎరువులను వినియోగిస్తే సాగు వ్యయం తగ్గి భూసారం పెరుగుతుంది. రైతులు ఈ విషయంపై చైతన్య పరుస్తున్నాం. రైతులు అధికారులు సూచనలు, సలహాలు పాటించి పెట్టుబడులను తగ్గించుకోవాలి. – వి.జోగిరాజు, మండల వ్యవసాయ శాఖ అధికారి కొత్తపల్లి

నేడు పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు సమావేశం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆలయ ఆవరణలో ఆలయ అభివృద్ధి పనులతో పాటు వచ్చే నెల 15 నుంచి ప్రారంభం కానున్న దేవి నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంటుంది. ఈ సమావేశానికి ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు అధ్యక్షత వహిస్తారని, సభ్యులు హాజరు కావాలన్నారు.

పిఠాపురంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలి

పిఠాపురం: గ్రామంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలని, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరహాలు, గంగా సూరిబాబు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర మంగళవారం పిఠాపురం చేరుకోగా వారు ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడారు. పిఠాపురం డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నందున వెంటనే భవన నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- తాటిపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం



తాటిపర్తిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు, స్థానిక నాయకులు

పిఠాపురం: నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు గ్రామస్తులకు వివరించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో పర్యటించిన ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. ప్రతి ఇంట్లో వారిని పలకరించి ఆయా ఇంటిలో ఎవరెవరికి ఏయే పథకాలు అందుతున్నాయి అడిగి తెలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోను ఏదో ఒక పథకం వర్తించిందని ఎవరికి ఏదీ రాలేదనే మాట లేకుండా అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ప్రతి పక్షాలు గ్రామాల్లో అడుగు పెట్టే అర్హత లేక ప్రభుత్వ పథకాలపై తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా చేసి ప్రభుత్వ పథకాలను కేవలం టీడీపీ వారికి మాత్రమే కట్టబెట్టారని ఆయన విమర్శించారు. ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఎటువంటి పైరవీలు, రాజకీయాలు లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందేలా చేసి అవినీతికి తావు లేకుండా చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో దాసం వెంకటేష్ గారపాటి బుజ్జి పలువురు వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు తగిన గుణపాఠం



జ్యోతుల బాబులు

కొత్తపల్లి: చట్టం ముందు ఎంతటి వారికైనా శిక్ష తప్పదని చంద్రబాబు ఉదంతమే నిదర్శనమని మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మట్లాడుతూ గత టీడీపీ పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోచుకోవడమే కాకుండా తాను సచ్ఛీలుడినని, నిప్పునని ప్రగల్భాలు పలుకుతూ ప్రజలను మభ్య పెడుతున్న ఆయనకు జైలు శిక్ష తప్పదని ప్రజలు విశ్వసిస్తున్నారని ఆయన అన్నారు. చంద్రబాబు అవినీతి నుంచి ప్రజలను దృష్టి మరల్చడానికి ఆ పార్టీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని, ఎంత చేసిన అవినీతి తగ్గ శిక్ష ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని నిరంతరం విమర్శించే చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్‌లో నిధులు పక్కదారి పట్టించడంతోనే కటకటాల పాలయ్యారని, ముందస్తుగా తన అరెస్టు గురించి పలు సభల్లో ప్రస్తావించారంటే ఆయనకు ముందే ఈ విషయం తెలిసిందన్నారు. అవినీతిపరులకు వత్తాసు పలికే పవన్‌ను ఏమంటారని ప్రజలు మండిపడుతున్నారని అన్నారు.

శ్రీపాద జయంతి మహోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో శ్రీపాద శ్రీవల్లభ స్వామివారు



స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పిఠాపురం: స్థానిక ప్రముఖ దత్త పుణ్య క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభ జయంతి మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకీ సేవ, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల నడుమ స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమాలు చేశారు. వందలాది మంది మరాఠీలు పాల్గొనగా స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ సౌజన్య ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన అవసరమని హెల్త్ ఎగ్జిక్యూటర్ కృష్ణారావు అన్నారు. మూలపేటలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణులు, బాలింతలకు తీసుకోవలసిన ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులకు బేటీ బచావో, బేటీ పడావో, వివాహ వయస్సు, బాలికల ఆరోగ్యం-రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే చిన్నారుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, బాల్య వివాహాలు వలన ఆరోగ్య పరంగా అనేక నష్టాలు జరుగుతాయన్నారు. అందరూ చదువుకోవాలని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు, బాలికల ఆరోగ్య రక్షణపై పలు విషయాలను వివరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది అందుబాటులు ఉంటున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

15న సీపీఐ జిల్లా మహాసభలు



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న తాటిపాక మధు

సామర్లకోట: సీపీఐ జిల్లా మహాసభలను ఈ నెల 15వ తేదీన సామర్లకోటలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు తెలిపారు. మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెదిరెడ్ల సత్యనారాయణ, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

కొత్తపల్లి: గణపతి నవరాత్ర మహోత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై రామలింగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణపై మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఏర్పాటు చేసే మందిరాలు, మైక్‌లకు కమిటీ సభ్యులు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే ఉత్సవ కార్యక్రమాలు, నిమజ్జనం నిర్వహించే విషయాలను రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని, ప్రజలకు, వాహన చోదకులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి 10 గంటల లోపు మైక్‌లు నిలిపివేయాలని హెచ్చరించారు.

రాకెట్ నమూనాలకు పూర్వ వైభవం

- పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం
- తలాటం సేవలకు అధ్యాపకుల సత్కారం



రాకెట్ నమూనా వద్ద తలాటం హరిష్, ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, అధ్యాపకులు

బాలాజీచెరువు: చంద్రయాన్-3 విజయోత్సవ వేడుకల్లో భాగంగా పీఆర్ కళాశాల పూర్వ విద్యార్థి, హరీష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ చైర్మన్ తలాటం హరిష్ కళాశాలలో మరుగున పడ్డ రాకెట్ నమూనాలకు పూర్వ వైభవం తీసుకురావడం అభినందనీయమని పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం పేర్కొన్నారు. కళాశాల భౌతిక శాస్త్ర విభాగం మ్యూజియంలో చంద్రయాన్ రాకెట్ల నమూనాలను ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పీడీ వర్మ స్వాగతం పలకగా ప్రిన్సిపాల్ తిరుపాణ్యం ముఖ్య అతిథిగా, హరీష్ విశిష్ట అతిథిగా, ఓల్డ్ స్టూడెంట్స్ అలుమిని కార్యదర్శి సత్యస్వరూప్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి హరీష్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా హరీష్‌ను ప్రిన్సిపాల్ అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో గ్రౌండ్ యుజర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పంపన సాయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

కాకినాడ రూరల్: ప్లాస్టిక్ సంచుల వినియోగంతో పర్యావరణానికి ముప్పుతో పాటు ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు పి. పార్థసారథి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల శూన్య దినోత్సవం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ సంచుల స్థానే గుడ్డ సంచులను వినియోగించాలని పార్థసారథి తెలిపారు. అడబాల రత్న ప్రసాద్, రవిశంకర్ పట్నాయక్ ,రాజా తదితరులు పాల్గొన్నారు.

సామూహిక హారతి కార్యక్రమం

ఏలేశ్వరం: శ్రావణమాసం ముగింపును పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక రూపులమ్మ అమ్మవారి ఆలయంలో హారతి కార్యక్రమం చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రావణ మాసంలో ఇంటింటా పారాయణ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, ఉడతల రమణారావు, తూమురౌతు గురయ్య, సంఘ మహిళాసభ్యులు లక్ష్మీకుమారి, మల్లేశ్వరీ, ఇందిరా, పద్మజ, సూర్యకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

గండేపల్లి: లారీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి లారీని అదుపుచేయడంతో ఇద్దరు విద్యార్థులకు ప్రాణం గండం తప్పి గాయాలతో బయటపడ్డారు. స్థానికులు, ప్రయాణికుల కథనం మేరకు కడియపు లంకకు చెందిన కె.మణికంఠ, కె.నారాయణ మంగళవారం స్కూటీపై తాళ్లూరు వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ ప్రయాణంలో గ్రామంలోని డివైడర్ వద్ద దూడ అడ్డుగా రావడంతో దానిని ఢీకొట్టిన ఇద్దరు విద్యార్థులు రోడ్డుపై పడిపోయారు. వారి పక్క నుంచే వెళుతున్న లారీ డ్రైవర్ దీనిని గమనించి వెంటనే సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో స్కూటీ లారీ కిందపడింది. ఈ ప్రమాదంలో మణికంఠకు తీవ్రంగా, నారాయణకు స్వల్పంగాను గాయాలయ్యాయి. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు అంబులెన్స్ సిబ్బంది వైద్య నిమిత్తం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

మహాసభలను విజయవంతం చేయాలి

జగ్గంపేట: ఢిల్లీలో ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న అఖిల భారత మహిళా సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ జగ్గంపేట మండలం భావవరం గ్రామంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఢిల్లీలో జరుగుతున్న 9వ జాతీయ మహాసభలలో మహిళలకు సమన్యాయం, సమానత్వం అనే నినాదంతో చర్చ జరిపి దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంపూడి రాజు, మహిళా నేతలు వెంకటలక్ష్మి, కూడే నూక రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న ఈఆర్వో, కమిషనర్ నాగనరసింహారావు



వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

- ఈఆర్వో నాగనరసింహారావు
- రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

కాకినాడ: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, ఓటర్ల తొలగింపు తదితర క్లెయిముల ప్రగతిని రాజకీయ పార్టీలకు వివరించి, వారిచ్చిన సూచనలు స్వీకరించారు. నియోజకవర్గ పరిధిలో ఫారం-6 కింద కొత్త ఓట్ల నమోదు కోసం 4,697 దరఖాస్తులు రాగా, 1916 పరిష్కరించామన్నారు. వేర్వేరు ప్రాంతాల్లో రెండేసి ఓట్లు, మరణించిన ఓటర్లు, తొలగింపులకు సంబంధించి 18,510 దరఖాస్తులు రాగా 10,717 పరిష్కరించామని అన్నారు. ఇక ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల కోసం 33,353 దరఖాస్తులు రాగా 23,413 పరిష్కరించామని అన్నారు. మిగిలిన వాటిని 15వ తేదీలోగా పరిష్కరిస్తామని అన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేని పరిస్థితుల్లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనల మేరకు తదుపరి ప్రతిపాదనలు చేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ తరపున రావూరి వెంకటేశ్వరరావు, రాగిరెడ్డి సుబ్బారావు, ఎంజీకే కిశోర్, టీడీపీ నుంచి వెంకటేశ్వరరావు, సీపీఎం నుంచి వనమాడి వీరబాబు, బీఎస్పీ నుంచి అప్పారావు, ఆమ్ ఆద్మీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యం

కాకినాడ సిటీ: సంక్షిప్త ఓటర్ల జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పులు, గ్రామాంతరం, ఒకే ఇంటిలో 10 కంటే ఎక్కువ ఓటర్లు, ముఖ్యంగా శతాధిక ఓటర్లను గుర్తించినట్టు ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం నియోజకవర్గం ఈఆర్వో, ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులు, తొలగింపులు, శతాధిక ఓటర్ల గుర్తింపు తదితర అంశాలను పారదర్శకంగా పరిశీలించి సమగ్ర ఓటర్ల జాబితాను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. వివిధ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, ఎస్.అప్పారావు, కె.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.